మరి ఆ సాక్ష్యంతో శారదాంబ నిర్దోషి అని ఆనాడు ఎవరన్నా అనగలిగారా? మరి అంత ఘరానామనిషి పసి కుర్రాడితో అట్లాంటి పని చేసినదంటే ఆమెని ద్వేషించడం ప్రజల తప్పా! పోని చలం అన్నట్టు ఈవ్యభిచారం దోషం కాదేమో! లేక చాలా ఉత్తమ గుణమే అనుకుంటే తక్కిన దుష్టత్వాలు సంగతేమిటి? ఇంక చెడుగులకీ మంచికీ భేదంలేదంటే నాగరికత సంఘమూ ఎట్లా నిలబడతాయి?

అంతే అంతే జీవితం అంతే. మరి ఖర్మగాక ఇంకేమంటాము? కాకపోతే ఇంక యీ అదృష్టాలకి అర్థమేలేదు. దేవుడు లేడు న్యాయంలేదు సత్యం లేదు. ఒక ప్రాణం Consciousness లేని గుడ్డి accident ఈ సృష్టి. ఆ సముద్రంలోంచి అనేక నీటి బిందువులు నిరంతరం చిందుతో వుంటాయి. కొన్ని ఎండలో మెరుస్తాయి. కొన్ని కాళ్ళకి తగిలి పగులుతాయి. కొన్ని ఇసికలో ఇంకిపోతాయి. కొన్ని సముద్రంలోనే కలిసిపోతాయి. మనుషులూ అంతే అనాలా?

ఇట్లా జీవితానికి అర్థం యోచించడమే తెలివి తక్కువా? కాని హృదయం వున్నవాళ్ళు ఏమీ యోచించకండా, ఏదో లెద్దూ మనకెందుకని ఊరుకోలేరు కద! కాని ఇన్ని యుగాలు యోచించి ఓ అసలు నిజాన్ని కనుక్కోలేక పోయినారు. ఏం లాభం? ఉదారుల మనస్సులు అలిసి, ఏదో ఓ హద్దులో ఏదో ఓ తీయరీలోనివని సంతృప్తి పడతాయి. ఏవో కొన్ని సూత్రాల్ని నిజమని నమ్మి ఆగకపోతే శాంతిలేదు. కాని వాటిమీద ఇంకా సందేహాలు. మాకు తెలిసింది ఇంతే సంగతి అన్నవాళ్ళు తెలివంతా వుత్తఅలుపు, బలహీనం. ఏదో సత్యం వుందేమో? ఇంకా మనకి తెలీదేమో! ఎన్నటికీ తెలీదో! కాని తెలుసు ననడం ఇంతే ననడం వుత్త అలసత్వం అనుకుంటాను.

---